క్లుప్తంగా

నేడు పట్టణంలో విశ్వరూప్ ప్రచారం

అమలాపురం టౌన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అమలాపురం పట్టణంలోని 24, 25, 26, 27 వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహిస్తారని పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. తొలుత 24వ వార్డు పరిధిలోని మహాలక్ష్మినగర్ పార్కు వద్ద నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల సిబ్బంది నిబంధనలు తెలుసుకోవాలి



అధికారులకు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఓ మునిస్వామి

యానాం: ఎన్నికల సిబ్బంది ఎన్నికల కమిషన్ నిబంధనలు పూర్తి స్థాయిలో తెలుసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్ఎస్ఏ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ అధికారులకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ పొందుపరిచిన నిబంధనల మేరకు అన్ని సక్రమంగా పాటిస్తూ పోలింగ్ ప్రశాంతంగా నిష్పక్షపాతంగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైథిలింగానికి మద్దతుగా ప్రచారం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న వి.వైథిలింగానికి మద్దతుగా కాంగ్రెస్ ఇన్‌చార్జి మల్లాడి సత్తిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరియాంపేట, దొమ్మేటిపేట, సీతారామనగర్‌లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్లాడి బీరాస్వామి, ప్రసాద్‌రాజు, సత్యనారాయణరాజు, లంకే అంజయ్య, శ్రీను, సుబ్బారావు, చక్రవర్తి, బంగారం, మున్నా తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో నమశ్శివాయం ప్రచారం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న హోంమంత్రి నమశ్శివాయం యానాంలో ప్రచార తేదీలు మారాయని, ఆయన ఈ నెల 11, 12 తేదీల్లో యానాం నియోజకవర్గంలో ప్రచారం చేస్తారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ, అదేవిధంగా 12వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఆయన ప్రచారాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ ప్రచార కార్యక్రమానికి సీఎం రంగసామి, పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.

ప్రధాన కాలువకు అడ్డుకట్టపై ఆందోళన

తాళ్లరేవు: పంట చేతికొచ్చే సమయంలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతుంటే ఇరిగేషన్ అధికారులు ప్రధాన పంట కాలువకు అడ్డుకట్ట వేసి నీటిని యానాం తరలించడంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలేకుర్రు, పి.మల్లవరం, నీలపల్లి గ్రామ పంచాయతీల్లోని పంట పొలాలకు సాగునీరు అందని నేపథ్యంలో ఓఎన్జీసీ పైపులైన్ ద్వారా కూడా సాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా పత్తిగొంది, రాంజీనగర్ ప్రాంతాలకు పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రధాన పంట కాలువకు పిల్లంక వద్ద ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసి నీటిని యానాం తరలించడాన్ని రైతులు గుర్తించి ఆందోళన చేపట్టారు. మరో పది, పదిహేను రోజుల్లో పంట చేతికి వస్తుందని, పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేయాలని రైతులు మొగలితుర్తి నాగేంద్రరావు, అనుసూరి చినసత్యన్నారాయణ, జడ్డు గోపి, ఎం.ప్రసాద్, సత్తిబాబు, పిల్లారాయుడు, హరిబాబు, నాగరాజు, ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు.

సంక్షేమ కార్యక్రమాలు నిలిపేశారు

యానాం: పుదుచ్చేరిలో గత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన వివిధ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తుత బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో నిలిచిపోయాయని కాంగ్రెస్ అభ్యర్థి వి.వైథిలింగం ఆరోపించారు. శనివారం ఆయన తిరుభవన్ నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యుత్ చార్జీలు పేద, మధ్యతరగతి ప్రజలకు షాక్ కొట్టేలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఉచిత కరెంటు పంపిణీ చేశామని, అయితే ఎన్డీయే ప్రభుత్వం దాన్ని నిలిపివేసిందని విమర్శించారు. తాము గతంలో రేషన్‌షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తే దాన్ని కూడా నిలిపేశారన్నారు. 9 ఏళ్ల బాలికను గంజాయి డ్రగ్ గ్యాంగ్ హత్య చేస్తే ఇప్పటి వరకూ పూర్తి స్థాయిలో నిందితులను ఎందుకని అరెస్ట్ చేయలేకపోయారని ప్రశ్నించారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- నడిపూడి, పాలగుమ్మి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ నడిపూడిలో ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్



పాలగుమ్మిలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు చేశారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి, నడిపూడి గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత పాలగుమ్మి కంభంపాడు కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలు హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలనను అందిస్తున్నారన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసమే కాకుండా, సర్వజన సంక్షేమం కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని అనేక పథకాలను అమలు చేస్తూ ఏపీని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ అవసరం వచ్చినా పచ్చచొక్కాలను, జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవలసి వచ్చేదన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఆ వ్యక్తి ప్రతిపక్షం వాడైనా సరే సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రభుత్వం తమదేనన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపొంది మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, సర్పంచ్‌లు కుడుపూడి రామలక్ష్మి, చెల్లుబోయిన నాని, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, డాక్టర్ శ్రీకాంత్, ఎంపీటీసీ అరిగెల శ్రీరామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాయుడు బాల, బొక్కా ఏడుకొండలు, కాట్రు చంద్రమోహన్, రంకిరెడ్డి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్‌లు రంకిరెడ్డి సాంబశివరావు, కాట్రు వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థులకు పతకాలు



జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

అమలాపురం టౌన్: ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో గత నెల 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ జరిగిన జు-జిట్స్ నేషనల్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో అమలాపురానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రథమ, తృతీయ విభాగాల్లో పతకాలు సాధించారు. ఫైటింగ్ సిస్టమ్‌లో 52 కేజీల విభాగంలో(అండర్-16) బొలిశెట్టి యశస్విని ప్రథమ స్థానంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. 44 కేజీల విభాగంలో(అండర్-14) అడపా రవిశంకరి, 57 కేజీల విభాగంలో(అండర్-16) చెల్లుబోయిన వినిషా సుసత్య, 40 కేజీల విభాగంలో(అండర్-14) గుత్తుల అశ్విత, 70 కేజీల విభాగంలో(అండర్-16 ప్లస్) పోతంశెట్టి సాయి సంపత్‌లు తృతీయ స్థానంతో కాంస్య పతకాలు సాధించారని చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. పోటీలకు అల్లాడి రవి రిఫరీగా వ్యవహరించారు.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన



ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ, పితాని బాలకృష్ణ



టి.కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారంలో ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- టి.కొత్తపల్లిలో ఎమ్మెల్యే పొన్నాడ ఎన్నికల ప్రచారం
- భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు

ఐ.పోలవరం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి గ్రామ పంచాయతీలో పితాని బాలకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత సీతమ్మ చెరువు నీలాలమ్మ తల్లి గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అడవిపేట, జాంబవన్ కాలనీ, ఎస్సీ పేట, వడ్డివారిపేట, రేవువారిపేట, అరుంధతి నగర్, సీతమ్మ చెరువు, మత్స్యకార కాలనీ, గంజావారి మెరక, వడగనవారి పేట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడకు మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అలాగే ఇటీవల పార్టీలో చేరిన పితాని బాలకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ప్రజలు గతంలో ప్రతి చిన్న పనికి జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి అన్ని శాఖల అధికారులను గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంచారన్నారు. ప్రభుత్వం నుంచి జరగాల్సిన ప్రతి పని వలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి పూర్తి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో పాతుకుపోయిన దళారి వ్యవస్థకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెల్లు చీటి పలికారన్నారు. గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారన్నారు. అయితే జగనన్న ప్రభుత్వ పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకుని రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమికి తగిన గుణపాఠం చెప్పి, వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కాశి బాలమునికుమారి, పండు విజయ్‌కుమార్, కాదా గోవిందకుమార్, కాశే రాజుబాబు, కాటం సత్తిరాజు, మెండా వెంకన్నబాబు, పెన్మత్స వాసురాజు, పండు నళిని, ఏలూరి ఆదినారాయణ, పెమ్మాడి బాబూరావు, విత్తనాల శ్రీనివాసరావు, కొండేపూడి కృపావరప్రసాద్, ఢిల్లీ నారాయణ, వడ్డి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అంతా కలిసికట్టుగా పని చేయాలి



రావులచెరువులో జరిగిన పార్టీ శెట్టిబలిజ నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ చేసుకునేందుకు అంతా కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. స్థానిక 30వ వార్డు రావులచెరువులో శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ శెట్టిబలిజ నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును, అమలాపురం అసెంబ్లీ నియోజకర్గ పార్టీ అభ్యర్థి, మంత్రి పినిపే విశ్వరూప్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. ఎన్నికల ప్రచారంలో శెట్టిబలిజలు ఎలాంటి ప్రణాళికలతో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలనే అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము తదితరులు ప్రసంగించారు.

మండలంలో 10,072 పింఛన్ల అందజేత



పింఛన్ తీసుకునేందుకు కాట్రేనికోన సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు

కాట్రేనికోన: మండలంలో 22 గ్రామ సచివాలయాల పరిధిలో 10,522 మంది పింఛను లబ్ధిదారులకు గాను శనివారం సాయంత్రం నాటికి 10,072 పింఛన్లు అందజేశారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకుండానే లబ్ధిదారులందరికీ ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్లు అందజేసేవారు. అయితే ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాల ఫిర్యాదులతో వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి తప్పించడంతో సచివాలయాల వద్ద పింఛన్లు అందజేశారు. వలంటీర్లను పింఛన్ల అందజేత నుంచి దూరంగా ఉంచడం వల్ల మండే ఎండలో సచివాలయాలకు వచ్చి పింఛను తీసుకోవాల్సి వచ్చిందని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఖతార్ రాజు బంగారు తపాలా బిళ్ల సేకరణ



ఖతార్ దేశ రాజు ముఖ చిత్రంతో కూడిన బంగారు తపాలా బిళ్ల

అమలాపురం టౌన్: ఖతార్ దేశం రాజు తమిమ్ బిన్ హమద్ అల్ థానీ సింహాసనాన్ని అధిష్టించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ రాజు ముఖ చిత్రంలో 200 రియాల్స్ ముఖ విలువతో బంగారు తపాలా బిళ్లను ముద్రించారు. అమలాపురానికి చెందిన తపాలా బిళ్లల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ఈ బంగారు తపాలా బిళ్లను సేకరించారు. కేవలం వెయ్యి మాత్రమే ముద్రించిన ఈ తపాలా బిళ్లలు ఒక్కొక్కటి ఒక గ్రాము మేలిమి బంగారంతో తయారుచేశారు. అరుదైన ఈ బంగారు తపాలా బిళ్లను ఖతార్ దేశంలో తన మిత్రుడు చలంచర్ల కాశీ విశ్వనాథ్ ద్వారా సేకరించినట్లు కృష్ణ కామేశ్వర్ తెలిపారు. ఈ తపాలా బిళ్లను ప్రత్యేక టెక్నాలజీ ద్వారా నెదర్లాండ్‌లో ముద్రించారని ఆయన చెప్పారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



సన్నవిల్లి జనసేన నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్



టి.కొత్తపల్లిలో ఎమ్మెల్యే పొన్నాడ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామానికి చెందిన పలువురు జనసేన కార్యకర్తలు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో శనివారం చేరారు. గ్రామంలో జనసేన మద్దతుదారులుగా వార్డు సభ్యులుగా గెలుపొందిన చిక్కం చిరంజీవి శ్రీనివాసరావు, గనిశెట్టి వీరాస్వామి నాయుడు, వానపల్లి దుర్గారావు, గనిశెట్టి ప్రభాకర్ నాయుడు, అమరగంటి చిరంజీవి, అరిగెల వెంకటేశ్వరరావు, కొళ్లపల్లి భగవాన్, చిక్కం బాలు, నాగవెంకట శ్రీనివాస్‌లతో పాటు మరో 30 మంది జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి విశ్వరూప్ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో తమకు చాలా అవమానాలు ఎదురయ్యాయన్నారు. పవన్ కల్యాణ్‌పై అభిమానంతో ఇన్నాళ్లుగా జనసేనలో ఉన్నామని, తీరా చూస్తే చంద్రబాబు అడుగుజాడల్లో ఆయన నడుచుకుని అమలాపురం అసెంబ్లీ సీటు టీడీపీ కేటాయించడంతో తమ ఆత్మగౌరవం చంపుకుని టీడీపీకి పట్టం కట్టలేమన్నారు. సీఎం జగన్ అన్నీ కులాలకు, వర్గాలకు సమన్యాయం చేశారని, తమ గ్రామం నుంచి అత్యధిక మెజారిటీ వైఎస్సార్ సీపీకి ఇచ్చి తమ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, వ్యవసాయ మండలి మండల చైర్మన్ మానే శ్రీను, మోటూరి సత్యంకాపు, గుంట్రు చిటిబాబు, చిక్కం నాగబాబు, నక్కా చిన్నా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

ఐ.పోలవరం: మండలంలోని తీరప్రాంత గ్రామం భైరవపాలెం, తీర్థాలమొండి గ్రామాలకు చెందిన అగ్నికుల క్షత్రియ కుటుంబాలకు చెందిన 50 మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం టి.కొత్తపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. సంగాడి ధర్మారావు, రేకాడి సత్తిబాబు, రేకాడి ధర్మారావుతో పాటు పలువురికి ఎమ్మెల్యే పొన్నాడ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ పేదలకు సేవ చేసే అవకాశం వైఎస్సార్ సీపీ ద్వారానే సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పితాని బాలకృష్ణ, పెమ్మాడి బాబూరావు, ఢిల్లీ నారాయణ, పండు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడిగా పరశురాం



నూతన కమిటీకి నియామక పత్రాలను అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు

అమలాపురం రూరల్: ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా కాశి పరశురాం నియమితులయ్యారు. బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అధ్యక్షతన అమలాపురంలో తిరత్న బుద్ధవిహార్‌లో శనివారం రాత్రి అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. సెక్రటరీగా ఈవీవీ సత్యనారాయణ, కోశాధికారి దోనిపాటి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా పెట్టా వెంకటరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.రమేష్ నియమితులయ్యారు. వారికి నియామక పత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీబీలోక్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ముగిసిన బ్యాలెట్ ఓటింగ్


302 ఓట్లకు గాను 288 స్వీకరణ



బ్యాలెట్ ఓటింగ్‌లో ప్రక్రియలో పాల్గొన్న అధికారుల బృందంతో ఆర్‌ఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ 85 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లకు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి నిర్వహించిన బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ముగిసిందని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మునిస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఫారం-12(డీ) ధ్రువీకరణ కలిగిన 85 ఏళ్లకు పైబడిన ఓటర్లు 117 మంది ఉండగా 110 మంది బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. అదే విధంగా దివ్యాంగులు 185 మంది ఉండగా 178 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మొత్తం 302 మంది ఓటర్లకు గాను 288 మంది ఓటు హక్కును బ్యాలెట్ ఓటింగ్ ద్వారా వినియోగించుకున్నారన్నారు. ఓటు వినియోగించుకోని 14 మందిలో ఐదుగురు మృతి చెందగా, 9 మంది వివిధ కారణాలతో ఓటును వేయలేదన్నారు. మొత్తం ఐదు బృందాలు ఇంటింటికీ వెళ్లి బ్యాలెట్ ఓట్లను స్వీకరించారన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ



తూర్పులంక సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని, 9,581 పింఛన్లకు గాను 9,383 పింఛన్లు అందజేశామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సచివాలయాలకు వచ్చే పింఛన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ ఉండేందుకు టెంట్లు ఏర్పాటు చేశామన్నారు. బెడ్ రిడెన్ లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి పెన్షన్ అందించామన్నారు. వంద శాతం పెన్షన్లు పంపిణీ చేయాలని ఏ ఒక్క లబ్ధిదారుడు నష్టపోకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం తూర్పులంక సచివాలయంలో పెన్షన్ల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో తొలిసారి ఓటు పొందిన యువత తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి ఎ.కుళొత్తుంగన్ శనివారం కోరారు. ఈ నెల 19న పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరగనున్న ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రలోభాలకు లొంగకుండా సరైన అభ్యర్థిని నిర్ణయించుకుని ఓటు వేయాలన్నారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరుగుతుంటే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సీ విజిల్ మొబైల్ అప్లికేషన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఫిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రోగులకు రక్తదానం



రక్తదానం చేస్తున్న కానిస్టేబుళ్లు

అమలాపురం టౌన్: స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రక్తనిధికి ఆరుగురు యోగాశ్రమ విద్యార్థులు, ఆరుగురు పోలీసు కానిస్టేబుళ్లు శనివారం రక్తదానం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రక్తం అత్యవసరమైన రోగులు, గర్భిణుల కోసం యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదానం జరిగింది. జిల్లా ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, ఏఆర్ ఆర్ఐ సీతారామ్‌లు యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ సేవలను అభినందించారు. రక్తదానం చేసిన యోగాశ్రమానికి చెందిన ఆరుగురు విద్యార్థులను పోలీసు అధికారులు అభినందించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



ఉప్పలగుప్తంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పాదులు

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామంలోని ఐనాపురం నుంచి పేరాయి చెరువు వరకూ విస్తరించి ఉన్న పంట కాలువ చెంతనే ఉన్న విద్యుత్ స్తంభానికి తీగ జాతికి చెందిన పాదులు అల్లుకున్నాయి. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో పాదులు విద్యుత్ వైర్లకు తగిలి తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రధాన కేంద్రం దగ్గరలోనే ఈ పరిస్థితి ఉన్నా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ చిత్రం శనివారం సాక్షి కెమెరాకు చిక్కింది.